# అర్జెంట్..! అర్జెంట్!

**పల్లేటి బాలాజీ**

"యమ అర్జెంట్‌గా ఓ కప్పు స్ట్రాంగ్ టీ ఇవ్వవేయ్!" అని టీకొట్టు ముందు అప్పుడే పరుగెత్తుకుంటూ వచ్చి నిలబడ్డ ఎలక్ట్రీషియన్ సుబ్బారావు టీ ఆర్డరు చేశాడు.

"టీయాకు ఉడుకుతోంది, ఐదు నిముషా లాగాలి!" అన్నాడు టీ వేసే అతను.

"మరైతే ఓ స్ట్రాంగ్ కాఫీ అయినా ఇవ్వు!" అన్నాడు సుబ్బారావు.

"వెధవది, ఈ కాఫీ ఫిల్టర్ కన్నాలు పూడిపోయి సరిగా డికాక్షన్ దిగి చావట్లేదు. ఓ పది నిముషాలు ఆగండి!" అన్నాడు షాపతను.

"ఛీ! ఛీ! ఏ దడిగినా ఆలస్యమే! ఏం షావయ్యా నీది! నే ననలే అర్జెంటుగా వెళ్లాలి. కంప్లైంట్స్ అన్నీ అర్జెంటువే! అసలు ఈ ప్రజలకు అన్నీ అర్జంటే!" అని విసుక్కుంటూ -

"టీయో, కాఫీయో ఏదో అర్జెంటుగా ఇచ్చి తగలడు! అర్జెంట్‌గా వెళ్లాలి" అని కసురుకున్నట్టు అడిగాడు షావువాడిని.

'అర్జెంట్‌గా వెళ్లి ఈయనగారు సాగించాల్సిన రాచకార్య మేమిటో! కాస్త ఆగి మంచి టీయో, కాఫీయో తాగి వెళ్లొచ్చుగా?' అనుకుంటూ ఓ కప్పు సుబ్బారావు చేతి కందించాడు షా పతను.

"వరవాలేదోయ్! నీకు మంచి భవిష్యత్తుంది. నేను అర్జెంట్‌గా వెళ్లాల్సిన వాడి నని గుర్తించి యమ అర్జెంట్‌గా కప్పు నా చేతి కందించావ్, థాంక్స్! అన్నట్టు నీకు థాంక్సంటే తెలుసుగా?" అన్నాడు సుబ్బారావు అదోలా ఫేసు పెట్టి.

సుబ్బారావు ఫేసులో 'వీడి మొహం! పావం, వీడికి ఇంగ్లీమ రాదులే!' అన్న భావం స్పష్టంగా అండర్‌లైన్ చేసినట్లు కనిపిస్తోంది.

"సార్! మీ రేం చదువుకున్నారు?" చాలా గౌరవంగా అడిగాడు టీ కొట్టతను.

"యూ సీ! సిక్స్త్ క్లాస్ టెన్ టైమ్స్ చదివి, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో సి.ఎల్.గా ఐదేళ్లు చేసి, ఇప్పుడు హెచ్ ర్యాంకులో ఉన్నాను" అన్నాడు గర్వంగా కాల రెగరేస్తూ.

'ఈ టీ కొట్టు వెధవకి 'సి.ఎల్.' అంటే క్యాజువల్ లేబరనీ, 'హెచ్' అంటే హెల్పర్ అని తెలుస్తుందా? చచ్చినా తెలియదు. హెచ్ ర్యాంక్ అంటే నే నేదో చాలా హై పొజిషన్‌లో ఉన్నాననుకుంటాడు వెధవ!' అని మనసులో ముసిముసిగా నవ్వుకున్నాడు.

"సార్! తమరికి జీత మెంత?" అన్నాడు షావతను.

'ఏంటి ఈ వెధవ ప్రశ్న మీద ప్రశ్న వేస్తున్నాడు?' అనుకుని, "చూడు మిస్టర్! నాకు చాలా అర్జెంట్ కంప్లైంట్ ఉంది. అయినా నే నడిగిన వెంటనే అర్జెంట్‌గా ఓ కప్పు నా చేతికిచ్చావు కనుక నీ ప్రశ్నలకు సమాధానం చెప్పే వెళ్తాను. ముం దీ కప్పు ఖాళీ చెయ్యనీ!" అని కప్పులో నుంచి ఒక సిప్ చేసి, తాగిందేంటో అర్థం కాని సుబ్బారావు అదోలా - అంటే బలవంతంగా ఆయుర్వేదిక్ ద్రావకం తాగిన వాడిలా ముఖం పెట్టి, "బాబూ! ఇంతకీ నువ్వు నా కిచ్చింది టీయా, కాఫీయా?" అని అడిగాడు.

"కాఫ్టీ!" అని చిరునవ్వుతో సమాధానం చెప్పాడు షావువాడు.


"కాఫ్టీయా? అంటే అదేమిటి, బాబూ!" అయోమయంగా అడిగాడు సుబ్బారావు.

"షావులో కస్టమర్స్ గ్లాసుల్లో మిగిలించేసిన కాఫీ టీలను ఓ గిన్నెలోకి వంచి ఉంచుతాను. ఎవరైనా అర్జెంట్ అర్జెంట్ వెళ్లాలి తప్పదంటే తప్పని పరిస్థితుల్లో దాన్ని కప్పులో వంచి వాళ్లకు ఇస్తూంటాను" అని వినయంగా చెప్పాడు షావతను.

అతడి మాటలు విన్న సుబ్బారావు కడుపులో గేల ప్రారంభమై, 'ఓక్' మన్న పెద్ద శబ్దంతో ఉదయం తిన్న ఉప్మా పెసరట్టు, మధ్యాహ్నం తిన్న కోడి ఉలవచారన్నం - రెండూ కలగావులగంగా బయటకు వచ్చాయి.

"ఏం, బాబూ! నే నింత పెద్ద ఎడ్యుకేటెడ్ జంటిల్మన్‌ని, తొందరవడితే 'కాఫ్టీ' ఇవ్వాల్సొస్తుంది. అందుకని మీరు కాస్త వెయిట్ చేయండని చెప్పొచ్చుగా!" అన్నాడు సుబ్బారావు నొచ్చుకుంటూ.

"నిజమే, సార్! మిమ్మల్ని చూస్తూనే ఈయ నో పెద్ద ఎడ్యుకేటెడ్ జంటిల్మన్‌గారులా ఉన్నారు. అందునా అర్జెంట్ అర్జెంట్ అని అరుస్తున్నారు.



## ఆదర్శ గురువు అచ్యుతరావుగారు



'బ్రతకలేక బడివంతులు' అన్నది ఒకప్పటి మాట. అయినా ఆ రోజులలో కూడా లాభసాటి కాని వృత్తే అయినా దీని కో'విశిష్టత ఉంది. చదువుకునే రోజుల్లో ఎంత అల్లరిచేసే విద్యార్థులైనా జీవితంలో స్థిరపడిన తర్వాత గురువుగారు కనబడితే అనాలోచితంగానే లేచి నిలబడి ఎంతో గౌరవం, అభిమానం చూపుతారు. దీనితో కలిగే సంతృప్తిని వందల్లో, వేలల్లో కొలవలేము.

మొన్నటిదాకా మలయమారుతాలు వీయించిన సదాశివరావుగారు తన గురించి రాస్తూ, విభిన్న శిఖరాలలో ఉన్న తన శిష్యులందరూ తనను 'మాష్టారు' అనే అంటారు. అంతకన్నా గొప్ప గౌరవ మేముంటుం దన్నారు. హృదయపు లోతుల్లో ఉన్న ఎనలేని సంతృప్తిలో నుంచి ఉబికిన మాట అది.

తెలుగు సాహిత్యంలో గణనీయమైన కృషి చేసిన టేకుమళ్ల అచ్యుతరావు గారు ఉపాధ్యాయులు. వారి విజయనగర సాహిత్య చరిత్ర మున్నగునవి చదవకుండా సాహిత్యాధ్యయనం పూర్తి కాదు. వారొక ఆదర్శ ఉపాధ్యాయులు. పాండిత్యంతోపాటు వారి వాత్సల్యం, శ్రద్ధ శిష్యులలో చెరగని ముద్ర వేసేవి.

అచ్యుతరావు గారి కుమారుడు టేకుమళ్ల విశ్వనాథంగారు. 1944లో మద్రాసులో సహకార శాఖలో అధికారిగా పనిచేస్తూండేవారు. అప్పుడు కొన్ని వందల నూలు బేళ్లు కొలంబోకు ఎగుమతి చేయగా, అవి ధనుష్కోటి [ఇప్పు డిది లేదు]లో ఎక్సైజ్ అధికారులతో అనుమతింపబడక నిలిపివేయబడ్డాయి. కింది అధికారులు వెళ్లినా ఫలితం లేకపోయింది. చివరకు విశ్వనాథంగారిని ధనుష్కోటి వెళ్లి ఎన్నివారాలైనా ఉండి పని పూర్తి చేసి రమ్మన్నారు. విశ్వనాథంగారు వారి పేరును 'వి.ఎన్. టేకుమళ్ల' అని వాడుకునేవారు. వారు ధనుష్కోటి చేరి ఎక్సైజ్ ఉన్నతాధికారి వద్దకు వెళ్లారు. ఆ అధికారి లోపలకు వచ్చిన విశ్వనాథం గారిని కూర్చోమని కూడా అనకుండా - "మీకు ఏదో దూరంగానైనా టేకుమళ్ల అచ్యుతరావు గారు తెలిసినవారో, కావలసినవారో అవుతారా?" అని అడిగాడు.

దాని కీయన "వారు మా నాయనగారు" అన్నారు. వెంటనే ఆ అధికారి లేచి దగ్గరకు వచ్చి కరచాలనం చేసి కూర్చుండబెట్టి "నా కీ రోజు చాలా సంతోషంగా ఉంది. 1904లో నేను వారి శిష్యుడిని. వారి శిష్య వాత్సల్యం, మంచితనం మరువరానివి" అని ప్రశంసించి, వచ్చిన పని అడిగారట.

పని తెలుసుకుని, అప్పటికప్పుడే అధికారులను పిలిచి ఆ రోజు రాత్రివరకు అన్ని బేళ్లనూ ఓడ కెక్కించి రిపోర్టు ఇవ్వమన్నారట! వారి మధుర స్మృతికి గుర్తుగా ఈ చిన్న పని చేస్తున్నందుకు ఎంతో సంబరపడిపోయారట.

నలభై సంవత్సరాల తర్వాత చూపెట్టిన అంతటి అభిమానానికి, గౌరవానికి గురుశిష్య సంబంధం కన్నా వేరే అనుబంధా లేమైనా ఉన్నాయనుకుంటారేమో! ఆ అధికారి పేరు సలాహుద్దీన్!

భాగవతము రామారావు [మద్రాసు]

తొందరగా ఇవ్వకపోతే ఎక్కడ కోప్పడతారో అని 'కాఫీ' ఇచ్చేశాను, సార్!" అని నొచ్చుకుంటున్నట్లుగా చెప్పి -

"ఇంతకీ ఎడ్యుకేటెడ్ జంటిల్మన్‌గారూ! తమ జీత మెంతో చెప్పనేలేదు" అన్నాడు షావతను.

"నీ కాఫీ రుచి చూసిన నా నాలుక కొంకర్లు తిరిగి అంకెలు పలకలేకపోతోంది. అయినా మన మేమన్నా రష్యాలో ఉన్నామా, అందరికీ సమానంగా జీతాలు రావడానికి!" అన్నాడు సుబ్బారావు విసుగ్గా.

"రష్యాలో అందరికీ సమానంగా జీతా లిస్తారా, సార్!" ఆశ్చర్యంగా అడిగాడు షావతను.

"ఎప్పుడో ఇచ్చేవారట. ప్రస్తుతం వాళ్లే పుడ్డుకి లేక చస్తున్నారట!" అన్నాడు సుబ్బారావు.

"సార్! తమరి జీతం ఎంతో చెప్పలేదు" అన్నాడు షావతను.

"వెధవ జీతం లేవయ్యా! ఏదో తొంభైవేలు వస్తుంది" అన్నాడు అతి సాధారణంగా.

"అమ్మో! తొంభైవేలే! రాష్ట్రపతికి కూడా అంతివ్వరేమో కదండీ!" అని అనుమానం వ్యక్తపరిచాడు షావతను.

"నీ ఫేసుకు రాష్ట్రపతి జీతం ఎంతో కూడా తెలుసా?" కోపంగా ప్రశ్నించాడు సుబ్బారావు.

"తెలియదండీ! కానీ తెలుసుకోవాలని తాపత్రయ పడటంలో తప్పు లేదుగా? ఇంతకీ తమరి మీద ఇంకా పైపై ఉద్యోగులు ఉంటారు కదండీ, వాళ్లకు లక్షలు, కోట్లల్లో ఇస్తారా జీతాలు?" అని అడిగాడు షావతను.

'ఒరేయ్! నువ్వు నన్ను ప్రశ్నలతోనే వేధించి చంపేటట్టున్నావురా!' అని మనసులోనే విసుక్కుని, 'అయినా నీ ప్రశ్నలన్నింటికీ భుజంపై శవాన్ని వేసుకున్న విక్రమార్కుడిలా సమాధానాలు చెప్తానని మాటిచ్చాను కాబట్టి ఓపిగ్గా చెప్తాను" అనుకుని -

"అవును బాబూ! నాకు వేలల్లో, నా పైవారికి లక్షల కోట్లల్లో ఇస్తారు" అన్నాడు.

"లక్షల కోట్లల్లో జీతా లిచ్చేంత గొప్పగా లేదుకదండీ మన దేశ ఆర్థిక పరిస్థితి?" అని అనుమానం వ్యక్తపరిచాడు షావతను.

'ఓరి వెధవా! దేశ ఆర్థిక పరిస్థితి మీద కూడా ప్రశ్న లేయగల తెలివుందిరా, నీకు?' "బాబూ! టీయాకు ఉడికిపోయిం దనుకుంటాను. ముం దే స్ట్రాంగ్ టీ ఇవ్వు!" అన్నాడు సుబ్బారావు.

"టీ కలిపేలోపల ప్రభుత్వం కోట్ల కోట్ల రూపాయలు జీతాల కోసం ఎలా తెచ్చివ్వగలుగుతోందో చెప్పండి సార్!" అన్నాడు షావతను.

"నేను లక్షలు, కోట్లు చెప్పింది రూపాయలు కాదు, పైసలు!" అని కాల రెగరేశాడు సుబ్బారావు.

"అంతే ... తమరి తొంభై వేలూ కూడా ..." అని అర్థోక్తిలో ఆపాడు షావతను.

"పైసలేలేవోయ్!" అన్నాడు ఫేసు పక్కకి తిప్పుకుని.

"సార్! తమరి పై ఉద్యోగులు బాగా మంచి మంచి చదువులు చదివుంటారా?"

"ఏం చదువులో, ఒక్కడికీ నాలా తెలివితేటలు లేవు గాక లేవు!"

"ఎంతైనా తమరు సిక్స్‌త్ క్లాసు టెన్ టైమ్స్ చదివిన తెలివిమంతులు కదండీ!" అంటూ మంచి స్ట్రాంగ్ టీ కప్పు సుబ్బారావు చేతి కందించాడు షావతను.

"పరవాలేదోయ్! నువ్వు నా తెలివితేటల్ని కనుక్కున్నావ్!" అని, టీకప్పులోంచి ఓ సిప్పు లాగి, "బ్రహ్మాండంగా ఉందోయ్, టీ!" అని చప్పరించాడు.

"చూడండి, ఎడ్యుకేటెడ్ జంటిల్మన్ సార్ గారూ! నేను టీ గాని, కాఫీ గాని బ్రహ్మాండంగానే చేసి నా కస్టమర్లకి ఇస్తుంటాను. కస్టమర్ ఇచ్చిన డబ్బుకి తగిన టేస్ట్ కలిగిన టీ, కాఫీనే ఇస్తూంటాను. కాకపోతే కొద్ది ఆలస్యం అవుతుం దంతే!" అన్నాడు షావతను.

"వెరీగుడ్ వెరీగుడ్! ఈ ఎడ్యుకేటెడ్ జంటిల్మన్ ఎప్పుడొచ్చినా మంచి టీ ఇచ్చి పంపుతూండు, సరేనా!" అన్నాడు సుబ్బారావు ఖాళీ కప్పు షావతని చేతికిస్తూ.

"మీ రెప్పుడొచ్చినా మంచి టీయే ఇస్తాను ఎడ్యుకేటెడ్ జంటిల్మన్ సార్!" అన్నా డతడు.

"గుడ్! న న్నింకేమైనా ప్రశ్నించదలచుకున్నావా?" అని అడిగాడు సుబ్బారావు.

"తమర్ని ప్రశ్నలు అడగాలనే ఉంది కానీ, తమరు ఎక్కడికో అర్జెంట్ అర్జెంట్‌గా వెళ్లాని వచ్చారు కనుక అడగలేకపోతున్నాను."

"నా అర్జెంట్ పనులను కావాలంటే వాయిదా వేసుకుంటాను. నీ ప్రశ్న లేమిటో చెప్పు!" అని అప్పటివరకూ నిల్చునే మాట్లాడిన సుబ్బారావు టీ కొట్టుముందున్న బెంచి మీద కూర్చున్నాడు.

"మిమ్మల్ని నేను ఒకే ప్రశ్న అడుగుతాను."

"ఒక్క టేమిటీ, వంద అడుగు. నీలాంటి చదువూ సంధ్యా లేని అనామకులకు తెలియని విషయాలు చెప్తే ఎంతో మంచిది" అన్నాడు అదోలా అతడి వైపు చూస్తూ.

"ఎడ్యుకేటెడ్ జంటిల్‌మన్ సార్! ఇంతకీ నే నెంతవరకూ చదువుకుని ఉంటానో మీకు తెలుసా?" అని ప్రశ్నించాడు.

"పెద్ద చదువులు చదివిన వాడివయితే ఇలా రోడ్డు పక్క టీకొట్టెందుకు పెట్టుకుంటావ్? ఏదో వేలిముద్ర అయి ఉంటావ్. అన్నట్టు వేలిముద్రలు మానండి - సంతకాలు నేర్పండి

అని ప్రభుత్వంవారు అక్షర యజ్ఞం చేపట్టారు. కనీసం నువ్వు సంతకం పెట్టడమైనా నేర్చుకో! లేదంటే బ్యాంకు లోను తీసుకోవా లనుకున్నప్పుడు బ్యాంకు మేనేజర్ మోసం చేయగలడు!" అని షావతనికి చెప్పాడు సుబ్బారావు.

షావతను ఓ చిరునవ్వు నవ్వి

"సీ, మిస్టర్ ఎడ్యుకేటెడ్ జంటిల్మాన్ సర్! ఐ యామే పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ పొలిటికల్ సైన్సెస్. నాట్ ఓన్లీ దట్, నౌ ఐ యామ్ డూయింగ్ డాక్టరేట్ ఇన్ దట్ సబ్జెక్ట్. సారీ! తమరు సిక్స్త్ టెన్ టైమ్సు చదివిన వీరులు. మీకు నేను చెప్పింది సరిగా అర్థం కాకపోవచ్చు. నేను రాజకీయ శాస్త్రం అన్న సబ్జెక్ట్ మీద ఎమ్మే చదివాను. ప్రస్తుతం అదే సబ్జెక్ట్‌లో డాక్టరేట్ చేస్తున్నాను. ఈ ప్రభుత్వం, ఈ రాజకీయ నాయకులు నా చదువుని గుర్తించి నా చదువుకు తగ్గ ఉద్యోగం ఇవ్వలేకపోతుందీ అని దుమ్మెత్తిపోయడంలేదు. కనీసం నిరుద్యోగ సంఘాల్లో మెంబర్‌గా కూడా చేరలేదు. డిగ్నిటీ ఫీలవకుండా బ్యాంకులో మూడు వేలు అప్పు తీసుకున్నాను. ఈ టీ కొట్టు పెట్టుకున్నాను. రోజుకి వంద రూపాయలు సంపాదిస్తున్నాను. నేను డాక్టరేట్ చేస్తున్నందుకు గవర్నమెంట్ నాకు నెలకు రెండువేలా ఐదు వందల రూపాయలు, అంటే నీ భాషలో రెండు లక్షలా యాభైవేల పైసలు నాకు ప్రభుత్వం ఇస్తుంది. దాన్ని నేను పేద విద్యార్థులకు జీతాలు, ఫీజులు కడుతుంటాను. కనుక మీరే గొప్ప ఎడ్యుకేటెడ్ జంటిల్మాన్ అని అనుకోకండి!" అన్నాడు షావతను.

ఆ మాటలు విన్న సుబ్బారావు కళ్ళు తూలి కింద పడ్డాడు.

"కొద్దిగా సర్దుకొని పైకి లేవండి, ఎడ్యుకేటెడ్ జంటిల్మాన్ గారూ! తమ రేదో అర్జెంట్ పని మీద వెళ్ళాలన్నారు. ఆ పనేదో గుర్తు తెచ్చుకుని వెళ్ళండి" అన్నాడు షావతను.

మెల్లగా పైకి లేచిన సుబ్బారావుగారు తన మొహం కూడా షావతనికి చూపించకుండా పరుగు లంకించుకున్నాడు. కొద్ది దూరం పరుగెత్తి ఆ తర్వాత మెల్లగా నడుస్తూ ఓ వీధి దగ్గరకొచ్చి, "కత్తుల రంగారెడ్డి వీధి ఇదే కదండీ!" అని పక్కన వెళ్తున్న ఒక వ్యక్తిని ప్రశ్నించాడు సుబ్బారావు.

"అవునండీ!" అన్నా డా వ్యక్తి.

"మరిక్కడ 'కత్తుల రంగారెడ్డి వీధి' అన్న పనుపు బోర్డు ఉండాలే! లే దేమిటి?" అనుమానంగా అడిగాడు సుబ్బారావు.

"మూణ్ణెల్ల క్రితం వరకూ ఉండేది. ఆ తర్వాత తీసేశారు."

"ఎందుకని?"

"వీధుల పేర్ల మీ దెక్కడా కులం పేరు ఉండకూడదని ప్రభుత్వం ఆర్డరు జారీ చేసింది, మీకు తెలియదా?" అని వింతగా చూశా డా వ్యక్తి సుబ్బారావు వైపు.

"ఆర్డరు జారీ చేసిన విషయం ఎవరో చెప్పగా విన్నాను. కాకపోతే నా కర్థం కాని విషయం ఒక్కటుంది. మీ రేం అనుకోకపోతే అడుగుతాను" అన్నాడు.

"అడగండి."



### షాపు

"మన లైబ్రేరియన్ కొడుకు ఈ దసరాకి ఏదో షాపు ఓపెన్ చేస్తున్నాట?"

"అదే, అద్దెకి నవలలు, పత్రికలు ఇచ్చే షాపు!"

అమ్మిశెట్టి [గుంటూరు]

"మ రేం లేదండీ! ఆ కులం సంఘం, ఈ కులం సంఘం. ఆ కులం సంఘానికి ఈ ప్రభుత్వం, ఈ కులం సంఘానికి ఆ ప్రభుత్వం మద్దతు ఉన్నాయంటారు" అని ఆగాడు సుబ్బారావు.

"భలేవారండీ! మనవాళ్ళు ఈ రాష్ట్రంలో కులం సంఘాలు పెట్టుకోవడంలో పెద్ద వింతేం లేదు. కాకపోతే మన రాష్ట్రం నుంచి విదేశాలకు తరలి వెళ్ళిన తెలివైన విద్యాధికులు సైతం ఆ యా దేశాల్లో తమ తమ కుల సంఘాలు ఏర్పాటు చేసుకున్నందుకు మీరు ఆశ్చర్యపోవాలి, తెలిసిందా?" అన్నా డా వ్యక్తి.

"నిజమేనండీ! నాలాంటి ఎడ్యుకేటెడ్ జంటిల్మాన్ బుర్రకు తట్టని ఐడియా మీకు తట్టినందుకు చాలా బాధాకరంగా ఉంది" అని వాపోయాడు సుబ్బారావు.

"ఓహో! నమస్తే మీరు ..." అని అర్థోక్తిలో ఆగా డా వ్యక్తి.

"నా గురించి చెప్పలేదు కదూ! నేను సిక్స్త్ క్లాస్ టెన్ టైమ్సు చదివి, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో సి.ఎల్.గా ఐదేళ్ళు సర్వీసు చేసి, ఇప్పుడు హెచ్ ర్యాంకులో ఉన్నాను" అన్నాడు గర్వంగా.

"ఓహో! అలాగా? ఇప్పుడు తమ రెక్కడకు వెళ్తున్నారండీ?" అని ప్రశ్నించా డా వ్యక్తి.

"ఈ కత్తుల రంగారెడ్డి వీధిలోని పదమూడో ఇంట్లో పవర్ లేదని కంప్లైంట్ వచ్చింది. అందుకని అర్జెంట్‌గా వెళ్తున్నాను" అన్నాడు సుబ్బారావు.

"దాని కోసం అర్జెంట్‌గా వెళ్ళాల్సిన అవసరం ఏముందండీ? తాపీగానే వెళ్ళొచ్చుగా?" అన్నా డా వ్యక్తి.

"అమ్మో! ఇంట్లో పవర్ ఫెయిల్యూర్ అని కంప్లైంట్ వస్తే తాపీగా వెళ్ళడమా? భలేవారండీ మీరు!" అన్నాడు సుబ్బారావు.

"మీరు చాలా సిన్సియర్ వర్కర్‌లా గున్నారే!" అన్నా డా వ్యక్తి.

"నేను వర్క్‌లో చాలా సిన్సియర్. ఎలాంటి కంప్లైంట్‌నైనా అర్జెంట్‌గా అటెండ్ చేస్తూంటాను" అని గర్వంగా కాల రెగరేశాడు సుబ్బారావు.

"మంచిది, పదండి! నాకూ ఈ వీధిలోనే పనుంది. నేనూ మీతోపాటు అక్కడివరకూ వస్తాను" అన్నా డా వ్యక్తి.

"సరే, పదండి!" అని అతడితోపాటు నడవసాగాడు సుబ్బారావు.

"అదే అనుకుంటా కదండీ, పదమూడో నంబరు ఇల్లు!" అన్నాడు సుబ్బారావు ఓ ఇంటి నంబరు వైపు చూస్తూ.

"అదే, పదండి! నేనూ అక్కడికే వస్తాను" అన్నా డా వ్యక్తి.

జేబులోని కంప్లైంట్ స్లిప్ చేతికి తీసుకుని దానిలోని పేరు చూస్తూ, "ఈ ఇంట్లో ఉండే కృష్ణారావు గారు మీకు ఫ్రెండా?" అన్నాడు ఇంటి మెయిన్ డోర్ దగ్గర నిలబడ్డ సుబ్బారావు.

అప్పుడు పక్కనున్న ఆ వ్యక్తి "కృష్ణారావు నా ఫ్రెండ్ కాదండీ! కాకపోతే ఆయన ఈ ఇంట్లో ఉండేవారు మూణ్ణెల్ల క్రితం వరకూ. ఆయన ఖాళీ చేసిన తర్వాత నేను చేరాను. బహుశా ఆయన ఈ ఇంట్లో ఉండేటప్పుడు కంప్లైంట్ ఇచ్చి ఉంటాడేమో! నా పేరు రామారావు. ఏమైనా మీరు చాలా సిన్సియర్ వర్కర్ సార్! నమస్తే! ఇంతకీ తమరి పేరు?" అని అడిగాడు రామారావు.

సమాధానం చెప్పాలంటే నోట మాట రాక అదోలా పేస్ పెట్టి రామారావును చూస్తూండిపోయాడు. పాపం సుబ్బారావు!

★

